నీటి సమస్య పరిష్కారానికి నిధుల మంజూరు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు



కొర్రపాడులో సంక్షేమ బావుట బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.79 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలోని బీసీ కాలనీలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మహిళలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని, మురికి కాలువలను ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య కోసం రూ.79 లక్షలు మంజూరు చేశామని, త్వరగా పనులు మొదలు పెట్టి ఇంటింటికి కొళాయిల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులు అడిగిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు.ప్రస్తుతం అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నామని, సొంత భవనాన్ని మంజూరు చేయాలని కార్యకర్త పద్మజ ఎమ్మెల్యేను కోరారు. పరిశీలించి కొత్త భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ బకాయిలు చెల్లించి, అంగన్‌వాడీ కేంద్రాలకు కరెంటు సౌకర్యం కల్పించినందుకు కొర్రపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. సర్పంచ్ పి.ఓబుళమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, నాయకులు కాటిగారి ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జమాల్‌రెడ్డి, వి.బాసు, ఓబులేసు, రాయపురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా పాల్గొన్నారు.

నేడు కొర్రపాడులో...

మండలంలోని కొర్రపాడు గ్రామంలో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం



నర్సింగ్‌పల్లెలో లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ అన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీలోని నర్సింగ్‌పల్లె, నర్సింగ్ కొట్టాల, సుందరయ్యకాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించి తమకు మద్దతుగా నిలవాలని కోరారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందడంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో పాలనలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు రమణ, మహబూబ్‌పీరా, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, చాపాటి నారాయణరెడ్డి, నాయకులు చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి, మాల కొండయ్య, శ్రీనివాసులరెడ్డి, శిరీష్, హ్యూమన్‌రైట్స్ ప్రసాదరావు, ఎంపీడీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మార్చి 22 లోపు గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను మార్చి 22వ తేదీ లోపల పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ అధికారులతో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని, మార్చి 23వ తేదీన సామూహిక గృహ ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. బేసమట్టము లెవల్‌లో 60, రూఫ్ లెవల్ 37, స్లాబు లెవల్ 45 ఇళ్ళు ఉన్నాయన్నారు. ఈ 142 ఇళ్ళను టార్గెట్‌గా పెట్టుకుని లబ్ధిదారులు, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ, డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్, ఈఓపీఆర్డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రీసర్వే



విశ్వనాథపురంలో భూ సర్వే చేస్తున్న సర్వేయర్లు, సిబ్బంది

చాపాడు : మండల పరిధిలోని 10 గ్రామాలలో జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద భూముల రీ సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో పూర్తయిన వెంగన్నగారిపల్లెలో భూ హక్కు పత్రాలను అందజేశారు. రెండో విడతలో భాగంగా చిన్నగురువళూరు, పెద్దగురువళూరు, అల్లాడుపల్లె, వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, చాపాడు, బద్రిపల్లె, కుచ్చుపాప, బూడిదపాడు రెవెన్యూ గ్రామాలలో సర్వే జరుగుతోందని తహసీల్దారు సుభాని, మండల సర్వేయర్ స్నేహలత తెలిపారు. సర్వే అనంతరం రైతులకు హద్దులు తెలియజేసి, అభ్యంతరాలుంటే వాటిని నమోదు చేస్తామన్నారు. సర్వే కార్యక్రమంలో సచివాలయ సర్వేలు, ఇతర మండలాల సిబ్బంది సర్వేలో పాల్గొంటారని ఫిబ్రవరి 10 నాటికి సర్వే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సర్వే పూర్తికి రైతులు సహకరించాలని అవసరమైన పత్రాలను సర్వే అధికారులకు చూపాలని తెలిపారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

విద్యుత్‌శాఖ ఈఈ జీవీ రామిరెడ్డి

మైదుకూరు : ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వర్తించాలని ఉద్యోగులకు విద్యుత్‌శాఖ ఈఈ జీవీ రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం డివిజన్ కార్యాలయంలో ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సిబ్బంది విధులు నిర్వహించేటప్పుడు తమ వద్ద కచ్చితంగా ఇండక్షన్ టెస్టర్, ఎర్త్ పైపు, రబ్బరు తొడుగులు, బెల్టు ఉండాలని ఆదేశించారు. పనులు చేసేటప్పుడు విధిగా సంబంధించిన లైన్ ఎర్తింగ్ చేసుకుని పనులు కొనసాగించాలన్నారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్‌వైర్లకు దూరంగా ఉండి సంబంధిత అధికారులకు, దగ్గరలోని ఉప కేంద్రాల్లో ఉండే సిబ్బందికి తెలియజేసి విద్యుత్ సిబ్బంది ద్వారా మరమ్మతులు చేయించుకోవాలని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ అధికారి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. రాహుకాలంలో అమ్మవారిని పసుపు, కుంకుమ, దీపాలతో అర్చించి కర్పూర హారతులు ఇచ్చారు. స్థానిక టౌటౌన్ సమీపంలోని పెద్దమ్మ తల్లి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అగస్త్యేశ్వరునికి, రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను చేసి పూలతో అలంకరించారు.

రైతులకు సకాలంలో రుణాలు అందించాలి

డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

వైవీయూ : రైతులకు సకాలంలో రుణాలు అందించి, తోడ్పాలు అందించాలని కడప జిల్లా సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచించారు. శుక్రవారం కడప నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో అగ్రికల్చర్ జేడీ ఎ. నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో సాగుచేస్తున్న పంటలకు సంబంధించిన సాగు చేసే పంటల వ్యయంకు తగ్గట్టుగా బ్యాంకులు రుణసౌకర్యం కల్పించి సహకారం అందించాలని సూచించారు. జేడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎస్. దుర్గాప్రసాద్, నాబార్డు డీడీఎం విజయవిహారి, డీసీసీ బ్యాంకు సీఈఓ కె. రాజేంద్రకుమార్, ఆదర్శరైతులు ఎస్. సుబ్బారెడ్డి, రంగారెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, రత్నం పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : యూటీఎఫ్ క్యాలెండర్ క్యాలెండర్, డైరీలను శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరమణయ్య, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంఈఓ సావిత్రమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై పోరాడటమే గాక, సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు మాట్లాడుతూ యూటీఎఫ్ రూపొందించిన డైరీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సెలవులు, సర్వీసు విషయాలతోపాటు ముఖ్యమైన జీఓలను డైరీతోపాటు అనుబంధ పుస్తకంగా ముద్రించామన్నారు. ప్రధానోపాధ్యాయులు సత్యబాబు, కాశీప్రసాద్‌రెడ్డి, గుర్రప్ప, యూటీఎఫ్ నాయకులు నాగరాజు, మోహన్‌కుమార్, నరేష్, సరళ దేవి, అరుణ, జయలక్ష్మి, పార్వతి, లక్ష్మీదేవి, హరిత, కొండయ్య, ఫయాజ్ హుసేన్, గంగన్న పాల్గొన్నారు.

జగనన్నకు చల్లని దీవెనలు అందించండి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్సీగోవిందరెడ్డి

కలసపాడు : రాష్ట్రంలోని వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు విరబూయించిన సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్సార్ పింఛన్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 154 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము పెంచుతున్నామన్నారు. మండలంలో 4806 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయని, ప్రతి నెల రూ.1.32 కోట్లు అందజేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని పేద ప్రజలకు ప్రతి నెల పింఛన్లకు రూ.9 కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదారా మక్బుష్టారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, కలసపాడు సర్పంచ్ శివలీల, ఉప సర్పంచ్ పులివీరారెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పింఛన్ లబ్ధిదారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. ఈ నెల 11వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని, అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు గత ఏడాది జూలై నాటికి 21–35 ఏళ్ల వయస్సు ఉండి పదో తరగతి చదవి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అంగన్వాడీ వర్కర్ల పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి 21–35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు.. బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె (ఎస్సీ), మైదుకూరు మండలంలోని భూమాయపల్లె(బీసీ–సీ), వనిపెంట, అన్నలూరు(మైనర్ లోకోమోటార్) ఆయా పోస్టులు – చౌదరివారిపల్లె (ఓసీ), మదిరెడ్డిపల్లె (బీసీ–సీ), ఖాజీపేట మండలంలో సీతానగరం (ఓసీ), సి.కొత్తపేట(ఎస్టీ), దువ్వూరు మండలంలో బుక్కాయపల్లె(ఓసీ), పెద్దసింగనపల్లె(ఓసీ), జిల్లెల(బీసీ–ఏ), కానగూడూరు(బీసీ–ఈ), మైదుకూరు మండలంలో గోపిరెడ్డిపల్లె(బీసీ–బీ), గడ్డంవారిపల్లె(ఈడబ్ల్యూఎస్), నల్లపురెడ్డిపల్లె(ఎస్టీ), చెర్లోపల్లె(ఓసీ), మైదుకూరు– 1(బీసీ–ఏ), వనిపెంట–1(ఓసీ), మైదుకూరు–6(బీసీ–సీ), బాలాజీనగర్(బీసీ–బీ), చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లె(ఓసీ) గ్రామాలలో పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

బద్వేలు అర్బన్ : బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బద్వేలు, బి.కోడూరు, బి.మఠం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎస్.వసంతబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లె, బి.కోడూరు మండలం బి.కోడూరు–1 కేంద్రాల్లో కార్యకర్త పోస్టులకు, బద్వేలు మండలంలోని అనంతరాజుపురం, గుంతపల్లె–2, వెంకటశెట్టిపల్లె, అంబేద్కర్‌నగర్, బి.మఠం మండలం చౌదరివారిపల్లె, మద్దిరెడ్డిపల్లె, బి.కోడూరు మండలం రెడ్డివారిపల్లె, సిద్ధుగారిపల్లె కేంద్రాల్లోని సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని, ఈ నెల 11వ తేదీలోపు బద్వేలు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవిశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని రాయలసీమ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు మాట్లాడుతూ చదువుతోపాటూ క్రీడలు కూడా ముఖ్యమన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, పరుగు పోటీలు, లాంగ్ జంప్, జావెలిన్‌త్రో తదితర పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 16 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ హెచ్ఓడీ మంజునాథ్, పీడీ థామస్ తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



గోపవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : అవ్వాతాతలకు అండగా నేనున్నానంటూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.2750లకు పెంచి మాటతప్పని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శుక్రవారం స్త్రీశక్తిభవన్‌లో ఎంపీడీఓ హరినారాయణ అధ్యక్షతన కొత్తగా మంజూరైన 60 మందికి పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ మంజూరవుతుందని, ఇందులో ఎవరి ప్రమేయం ఉండదన్నారు. పింఛన్లు తొలగించారని ప్రతిపక్షాలు విమర్శించడంలో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పింఛన్లను అందజేశారు. అలాగే మండల పరిధిలోని భూములకు సంబంధించి రీసర్వే పూరైన వారికి జగనన్న భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అట్లూరు మండలంలోని కుంభగిరి రెవెన్యూ పొలంలో రీసర్వే పూర్తి చేయడం జరిగిందని రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండలాధ్యక్షురాలు పొత్తపి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పోతిరెడ్డిరెడ్డెయ్య, పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేకులకుంటలో..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకులకుంట గ్రామంలో శుక్రవారం పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ సుహాసిని, సచివాలయ కన్వీనర్ రాజానాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిపోగు జ్యోత్స్న, ఉపసర్పంచ్ బసిరెడ్డి, కన్వీనర్లు చక్రపాణి, తోకల శ్రీనివాసులు, వనిపెంట వీరారెడ్డి, నాయకులు సురేష్, వెంకటేష్, సచివాలయ కార్యదర్శి సురేష్‌బాబు, వలంటీర్లు పాల్గొన్నారు. నాగిశెట్టిపల్లెలో సర్పంచ్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు.

దువ్వూరులో..

దువ్వూరు : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ దండు చెంద్రాయుడు, ఉప సర్పంచ్ కొట్టే మురళి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లను అందిస్తోందని తెలిపారు.

మదూరులో పింఛన్ల పంపిణీ

చాపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన మాట ప్రకారం పింఛన్ల డబ్బులను ప్రతి ఏటా పెంచుతున్నారని వచ్చే ఏడాది రూ.2750ల నుంచి రూ.3వేలకు పెంచుతారని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని మదూరు, అన్నవరం గ్రామ సచివాలయాలలో శుక్రవారం లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన, డబ్బు పెరిగిన పింఛన్‌లను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

న్యాయవాదుల గుమస్తాల సంఘం ఉపాధ్యక్షునిగా భాస్కర్



ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్ర ప్రదేశ్ న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ప్రొద్దుటూరుకు చెందిన మునగ భాస్కర్ ఎన్నికయ్యారు. గురువారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గుమస్తాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు పింఛన్ల పంపిణీ

బద్వేలు : బద్వేలు మున్సిపాలిటీల్లో శనివారం జరిగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు పాల్గొననున్నారని పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం పది గంటలకు గుంతపల్లె వద్ద అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తారని, అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తారని చెప్పారు. నూతనంగా మున్సిపాలిటీ కొనుగోలు చేసిన జేసీబీని ప్రారంభిస్తారన్నారు.

రేపు యాదవ మహా సంఘం ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆటోనగర్‌లోని ప్యారడైజ్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అఖిలభారత యాదవ మహా సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లా రాజగోపాల్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదవులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య, పారిశ్రామిక పరంగా వెనుకబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. యాదవుల అన్ని రంగాల్లో రాణించడానికి, అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమ్మేళనంలో పలువురు రాష్ట్ర, జాతీయ యాదవ సంఘం నాయకులు పాల్గొంటారని యాదవులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ధర్నా

పోరుమామిళ్ల : విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మయ్య, మైదుకూరు డివిజన్ నాయకులు కొండయ్య, నౌషాద్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భైరవప్రసాద్‌లు మాట్లాడుతూ 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ పరిష్కరించాలని, 10 సంవత్సరాల సర్వీస్ ఇంటెన్సివ్ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి వారోత్సవాలు

పోరుమామిళ్ల : మండలంలోని గురప్పగారిపల్లెలో శుక్రవారం జనహిత ఏకల్ అభియాన్ కడప అంచల్ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య, అంచల్ కార్యదర్శి తిరుపతయ్య, సాధక్ సుబ్బరాయుడు, మాతాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : 'మే ఐహెల్ప్ యూ ఫౌండేషన్' వారు శుక్రవారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న పెద్దచీపాడు వీరభద్రుడు(76) చనిపోయాడు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు తెలిపారు. ఆయన స్పందించి శుక్రవారం ప్రొద్దుటూరు హిందూ శ్మశాన వాటికలో సాంప్రదాయ ప్రకారం వీరభద్రుడు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ కామనూరు శివసాయినాథ్, శుభన్, సుబ్బయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

11లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఐసీడీఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఈనెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు హైమావతి, అరుణ కుమారి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 8 ఆయా పోస్టులు, రూరల్ ప్రాజెక్టు పరిధిలో 16 ఆయా పోస్టులతోపాటు ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నట్లు వారు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనాస్థల పరిశీలన

పోరుమామిళ్ల : పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో గ్యాస్ లీకేజీ కారణంగా నాలుగు రోజుల క్రితం 5 మంది గాయపడిన విషయం తెలిసిందే. లీకేజీ జరిగిన స్థలాన్ని శుక్రవారం సాయంత్రం కడప సేల్స్ ఆఫీసర్ నవీన్ పరిశీలించారు. సిలెండర్ లీకేజీ కారణంగా రజియాబీ తీవ్రంగా గాయపడగా, ఆమెతో పాటు మరో నలుగురు గాయపడ్డారు. లీకేజీ ఘటనపై ఆయన చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల బంధువులను విచారించారు. నివేదిక తయారు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని నవీన్ తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబు

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా నేరుగా ప్రజలకు అందుతుంటే చంద్రబాబు వాస్తవాలు తెలుసుకోకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నారని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారులు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఇదేమీ గమనించకుండా చంద్రబాబు 5 కోట్లమంది ఒకవైపు, జగన్ ఒకవైపు అనడం, జగన్ పోవాలి...సైకిల్ రావాలి అనటం ఆయనకు మతిలేదనిపిస్తోంది.

పంట నమోదు చేయించుకోవాలి

బి.కోడూరు : రబీలో పంటలు సాగు చేసిన రైతులు తమ పంటలను రైతుభరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.కౌశిక తెలిపారు. శుక్రవారం మండలంలోని ఐత్రంపేట రైతుభరోసా కేంద్రం పరిధిలో సాగు చేసిన పంటలను, పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్ర సిబ్బంది రాజశేఖర్‌నాయక్, వీఆర్‌ఓ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

బి.కోడూరు : త్వరలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని ఆదిత్యారాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏపీఎంటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మహ్మద్ రఫీవుద్దీన్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాలరాజు, గౌరవాధ్యక్షుడు ఆసిఫ్ హుసేన్, సుందరం, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రొద్దుటూరు క్రైం : వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. మండలంలోని కల్లూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రభుత్వ పథకాలను సమీక్షించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోజు వారి జరిగే ఓపీ గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్త యాప్‌ల గురించి సిబ్బందికి వివరించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని కత్తెరగండ్ల గ్రామ సచివాలయంలో 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అందరికీ అందుబాటులో వైద్యం

అట్లూరు : అందరికీ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన మందులు అందజేయడం వంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు.

రేపు గణపతి సచ్చిదానంద స్వామి రాక

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎంఆర్ కాలనీలోని దత్త పీఠానికి మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, దత్త విజయానంద తీర్థ స్వామి ఆదివారం రానున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. 9న అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన సభా మండపం ప్రారంభిస్తారని వివరించారు.